# ముత్యాలు మనసు

**-కాకాని కమల**

బాలసూర్యుడు ఇంకా వెచ్చబడలేదు. లేత బంగారురంగు నులివెచ్చని ఉషోదయ కాంతులు వెదజల్లుతున్నాడు.

''పాలకూర...పాలకూర...'' అన్న కేకవిని గబగబా వీధి గుమ్మంలోకి వచ్చింది సుబ్బమ్మగారు.

అప్పుడే స్నానంచేసి మడిబట్ట ధావళి చుట్టుకుని నుదుట విభూది రేఖలు దిద్దుకుంది.

''రెండు అరటికాయలున్నాయి. కూర చేయవచ్చు. పప్పులోకి ఏం చేద్దామా?'' అనుకున్నంతలో పాలకూరమ్మి కేక వినిపించి వీధిలోకి వచ్చి

''ఓ పాలకూరమ్మీ...'' అంటూ కేక పెట్టింది.

నెత్తిన ఆకుకూరలు తట్ట పెట్టుకుని అటుగా పోతున్న ముత్యాలు సుబ్బమ్మగారి పిలుపు విని రోడ్డుదాటి గబగబా ఇటువచ్చి అరుగుమీద తట్ట దించుకుంది.

''పాలకూర రూపాయికెన్ని అమ్మీ?''

''ఆరు బామ్మగారు''

''మరీ కలికాలం కాకపోతే ఆరేమిటే? పది చేసుకో''

''వాలమ్మో. నడవదమ్మగోరూ. మార్కెట్లో ఇదే మేం సరాసరి తోటల నుంచి వస్తుంటాయి కనుక ఆరిస్తున్నా. ఆకు సూడండి. లేత తవలపాకులా ఎంత నవనవలాడిపోతోందో'' అంది మునివేళ్లతో ఆకు సవరిస్తూ.

''ఆ...నీ కబుర్లకేంగానీ పది చేసుకో. లేకపోతే మాకొద్దు. ఇంకా బోలెడుమంది వస్తారు''

''వాలమ్మో... మాకు గిట్టదమ్మగారూ. ఇంటికాడ ఎత్తిన బుట్ట ఈడ్నే దించినా. బోణీ బేరం. ఇంకో ఆఖరిమాట ఎనిమిది సేసుకోండి''

''సరే... కాసిని కట్టలు అట్టా అరుగుమీద వెయ్యి. మడి కట్టుకుని నీ బుట్ట ఎట్టా ముట్టుకుంటాను?'' అంది బామ్మగారు.

అరుగు అప్పటికే శుభ్రంగా కడిగి ముగ్గులు పెట్టివుంది. ముత్యాలు వేసిన కట్టల్లోంచి మంచి కట్టలు ఎనిమిది ఏరుకుంది బామ్మ. తాజాగా కూర బాగుంది అనుకుంటూ. లోపలికి వెళ్లి కూర ఇంట్లో పెట్టుకుని రెండు రూపాయల బిళ్ళ తెచ్చి అరుగుమీద పెడుతూ ''రూపాయి వుందిటే ఇయ్యి'' అంది.

''సిల్లర లేదండమ్మగారూ. తవరిదే బోణీ బేరం''

''ఇదెక్కడి సంతే. ఇంట్లో కూడా చిల్లరలేదు. నిన్ననే చిల్లరంతా ఖర్చు అయిపోతే ఆఖరిగా రెండు రూపాయల బిళ్ల వుంటే జాగ్రత్తగా అట్టే పెట్టాను'' రుసరుసలాడింది సుబ్బమ్మగారు.

''పోనీ... ఇంకో రూపాయి ఆకుకూర తీసుకోండమ్మగారూ''

''చాల్లే... ఏదో శాస్త్రం చెప్పినట్టుంది నీ మాట. రూపాయి కూరే ఎక్కువ. నీ సంచిలో వుంటుంది చూడు చిల్లర.''

''అయ్యో నాతాన లేదు బామ్మగారు. సూడండి'' అంటూ బొడ్లోంచి గుడ్డ సంచి తీసి అటూ ఇటూ తిరగేసింది.

''తమరిదే బోణీ అమ్మగారు. కూర అమ్ముకుంటేనేగానీ నాతాన డబ్బుండదు. అందులోంచే మూడు రూపాయలు గేటు కట్టాల. ఇంట్లో డబ్బాల్లో తవరే సూసివ్వండి'' అంది అరుగుమీద చతికిలబడుతూ.

ఆ మాటతో గయ్యిమంది సుబ్బమ్మ.

''ఏంటే పొద్దునే వెధవ సంత. ఎరక్కపోయి నిన్ను పిలిచా. ఓప్రక్క తొందరగా వంట మొదలెట్టాలి'' అంది. ఎనిమిదిన్నరకల్లా మనవడి స్కూలు ఆటో వస్తుంది. అప్పటికి భోజనం సగం అన్నా తయారు కావాలి. తొమ్మిదిన్నరకల్లా కొడుకు కోడలు భోజనం చేసి ఆఫీసులకి వెళ్లిపోతారు. తెల్లారకట్టే లేచి కొడుకు, కోడలు జాగింగ్‌కి వెళ్లారు. పావుగంట తరువాతగానీ రారు. మనవడేమో ట్యూషన్‌కి వెళ్లాడు. ఇంట్లో చిల్లరలేదు. ఒసేయ్ అమ్మీ! నువ్వు అలా అమ్ముకురా. లేదంటే నీ కూర నువ్వు తీసుకెళ్లు'' అంది చేతిలో ఆకుకూర కట్టలు తిరిగి అరుగుమీద వేస్తూ.

ముత్యాలు మనసు నీరుగారినట్టయ్యింది.

''బోణీబేరం అమ్మగారూ, తవరు తీసుకోపోతే ఈ దినం అంతా శనిపట్టినట్టవుతుంది''

''అందుకనే అమ్ముకుని రమ్మంటున్నానుకదే'' గద్దించింది సుబ్బమ్మ.

''ఎట్టామ్మగోరూ! నాలుగువీధులు సివరంట కాళ్లు అరిగేలా తిరిగితేగానీ డబ్బులు రావు. మీ రూపాయి కోసం మళ్లీ ఇంత దూరం రావాలంటే అయ్యే మాటేనా తల్లీ. నేనూ మడిసినే కదా''

''అయితే ఏమంటావే?'' అంటూ భద్రకాళిలా విరుచుకుపడబోతున్న సుబ్బమ్మగారు ఎదురుగా భుజాన సంచితో ట్యూషన్ నుంచి వస్తున్న మనవడ్ని చూసి-

''ఒరేయ్ తాతా! ప్రైవేటు పూర్తి అయ్యిందిరా?'' అంది.

''అయ్యింది బామ్మా''

''ఒరేయ్! ఆ పుస్తకాల సంచి అరుగుమీద పెట్టి ఇదిగో ఈ రెండు రూపాయల బిళ్ల అదిగో ఆ సందు చివర కిళ్లీకొట్లో మార్చి ఒక రూపాయి ఈ అమ్మికి ఇచ్చి ఇంకో రూపాయి జాగ్రత్తగా ఇంటికి పట్టుకురా'' అంది.

''పొద్దునే ఊరకే చిల్లర ఇవ్వడు బామ్మా. పేపరన్నా ఏదన్నా కొనాలి'' అన్నాడు కళ్లు తిప్పుతూ.

''మనకి పేపరు వచ్చింది కదరా'' అంది సుబ్బమ్మ.

''బామ్మా! నాకు పెన్సిల్ అయిపోయింది. కొనుక్కోనా? రూపాయికి చిన్న పెన్సిల్ వస్తుంది''

''సరే. ఆ పని చెయ్యి. అమ్మీ! వాడితో వెళ్లి ఆ కిళ్లీకొట్లో చిల్లర మార్చి నీ రూపాయి నీకిస్తాడు. అసలే ఆలస్యం అయిపోయింది'' అంటూ లోపలకు పరిగెత్తింది. మనవడు సంచి ఇంట్లో పెట్టి రోడ్డు దాటి సందు చివర కిళ్లీకొట్లోకి వచ్చాడు.

వెనకాలే తట్ట నెత్తిన పెట్టుకుని ముత్యాలు వచ్చింది. ఆలస్యం బామ్మకే కాదు ఆమెకీ అయింది.

''ఈపాటికి రెండు వీధులు తిరిగి సగం కట్టలు అమ్ముకునేదాన్ని'' అనుకుంది మనసులో గొణుక్కుంటూ. బోణీ బేరం అని ఆగాల్సి వచ్చింది.


అరుగుమీద బుట్ట నెత్తికి ఎత్తుకుంటుంటే లోపలికి వెళ్లిన బామ్మ మళ్లీ గబగబా బయటకు వచ్చి ''ఇదిగో అమ్మీ'' అని కేక పెట్టింది.

''ఏంది బామ్మగారూ?''

''చిన్నపిల్లాడ్ని చేసి ఎక్కువ తీసుకునేవు? సరిగ్గా రూపాయి తీసుకో''

''ఎంతమాట అమ్మగారూ. అసమంటి బుద్దే మాకుంటే ఇట్టా ఈది ఈది కాళ్లు అరిగేలా ఎందుకు తిరుగుతాం తల్లీ. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించుకుంటాంగానీ మోసం బుద్ధి నాతానలేదు'' ముత్యాలు గొంతులో పదును సరసరమంది.

''ఆ...మీ కబుర్లకేంలే. నీతులు బాగానే చెబుతారు. మనిషి కాస్త కన్ను మరుగు అయితే చేతికందిన వస్తువు ఎత్తుకుపోతారు?'' అంది సుబ్బమ్మ సణుగుతూ. ముత్యాలుకి వినిపించలేదు. లేకపోతే యుద్ధమే అయ్యేది.



రాముని చూస్తూనే ''ఏంది రాము! ఇంత పొద్దునే వచ్చావ్?'' అన్నాడు పేపర్లు క్లిప్పులకి పెట్టి వేలాడదీస్తున్న కిళ్లీకొట్టు మల్లేష్.

''ఇదిగో ఈ రెండు రూపాయలు తీసుకుని ఓ రూపాయి నాకివ్వు. ఆ అమ్మికి ఇవ్వాలి. ఇంకో రూపాయితో చిన్న పెన్సిలివ్వు'' అన్నాడు రాము.

మల్లేష్ డబ్బాలోంచి పెన్సిల్ తీసి గల్లాలోంచి రూపాయి బిళ్ల తీసి ''ఇదిగో రాము! పెన్సిల్, రూపాయి'' అన్నాడు.

పెన్సిల్ జేబులో పెట్టుకుని రూపాయి బిళ్ల తనకి అందిస్తున్న రాముని చూస్తూ ముత్యాలు నిలువునా కదిలినట్లు అయింది.

ముంచుముక్క కరుగుతున్నట్లు ఆమె కళ్లల్లోంచి నీళ్లు రాలుతుంటే గభాల్న తలమీంచి బుట్ట దించి రూపాయికి బదులు రెండు చేతులతో రాముని పట్టుకుంది ఆర్తిగా.

కళ్ల నుంచి నీళ్లు జలజలా రాలిపోతుంటే ఆపేక్షగా రెండు చేతులతో రాము ఒళ్లంతా తడుముతూ ''ఏంటి బాబూ! నీ పేరు రామూనా?'' అంది ఏదో అద్భుతమైన వింత పదాన్ని ఉచ్ఛరిస్తున్నట్లు.

రాము తన చక్రాల్లాంటి కళ్లని గుండ్రంగా తిప్పుతూ-

''అవును ఏం?'' అన్నాడు విస్తుపోతున్నట్లు.

''మరి... మరి... మీ బామ్మ నిన్న తాతా అని పిలిపించిందేమిటి?'' అంది.

ఆ మాటతో చప్పట్లు కొడుతూ రాము పకపకా నవ్వాడు

''అదా! మా తాతయ్య పేరు రామచంద్రయ్య. ఆయన చచ్చిపోయాక నేను పుట్టానట. అందుకని నాకు మా తాతయ్య పేరు పెట్టారు. మా బామ్మ నన్ను పేరు పెట్టి పిలవదు. తాతా అని పిలుస్తుంది. కానీ నా అసలు పేరు రాము అమ్మి'' అన్నాడు గలగలా నవ్వుతూ.

''నా నాయనే, నా తండ్రే, నా బంగారమా... మా అయ్యా నా ఆయుస్సు కూడా పోసుకుని బతకరా బిడ్డా'' అంటూ మెటికలు విరుస్తూ రాము వళ్లంతా తడుముతూ ఆ పసివాడ్ని తమకంగా కౌగలించుకుని ముద్దులు కురిపించసాగింది.

హఠాత్తుగా కళ్ల నీళ్లు కారుస్తూ కదిలిపోతున్న కూరలమ్మి ప్రవర్తన అర్థం కానట్టు ఇటు రాము అటు మల్లేష్, పేపర్లు కొనడానికి వచ్చిన ఒకరిద్దరు అలాగే నిలబడిపోయి చూస్తుంటే-

అదేం గమనించనట్టు కూరలమ్మి రాము అందించిన రూపాయి బిళ్ల మల్లేష్‌కి అందిస్తూ ''చాకిలీటు ఎంతయ్యా?'' అంది.

''అర్ధ రూపాయికి ఒకటి'' అన్నాడు మల్లేష్.


''రెండియ్యి'' అంటూ రూపాయి అందించి చాకలెట్లు తీసుకుని రాముని రెండు చేతులతో

ఎత్తుకుని ముద్దులు పెట్టుకుంది.

చాకలెట్లు రాము జేబులో వేస్తూ ''ఈ చాకలేట్లు తిను బిడ్డా! నా ఆయుస్సు కూడా తీసుకుని సల్లంగుండు బిడ్డా'' అంటూ మళ్లీ ప్రేమామృతం నిలువెత్తు కురిపించసాగింది.

ముక్కూమొగం ఎరుగని ఒక కూరలమ్మి తమ మీద అలా ప్రేమ కురిపిస్తుంటే ఏం చేయాలో తెలియనట్లు వింతగా అలా నిల్చుండిపోయాడు రాము.

దినపత్రికకు క్లిప్ చేస్తూనే ఓరకంట అదంతా గమనిస్తున్న మల్లేష్ ఆదరంగా కూరలమ్మిని చూస్తూ అడిగాడు.




''ఏమైందమ్మా?''

ఆ చిన్న పలకరింపుకే నీళ్ల కుండ భళ్లున పగిలినట్లు గభాల్న నేలమీద చతికిలబడిపోయింది ముత్యాలు. ధారలుగా జారిపోతున్న కన్నీటిని పమిట చెంగుతో అదుముకుంటూ అంది.

''ఏం చెప్పమంటావు సామీ! నా పెళ్లయిన పదేళ్లకి దేవుళ్లకు మొక్కగా మొక్కగా పండంటి కొడుకు పుట్టాడు. శ్రీరామచంద్రుడని పేరెట్టుకున్నా. దోగాడే వయసొచ్చింది. రామూ...రావుడూ అనగానే కిలకిలా నవ్వేవాడు. బిడ్డని సంకనేసుకుని బుట్ట నెత్తిన పెట్టుకుని కూరలు అమ్మేదాన్ని. నా మగనిది సెంట్రింగ్ పని. ఆ రోజు బిడ్డని గుడిసెలో సాపమీద పండబెట్టి బయటనుంచి తలుపు గడియవేసి రోడ్డు చివరనున్న బోరింగ్ కాడికి నీళ్ల తేబోయిన సామి. ఆడ జనం ఎక్కువ వుండి ఆలీసం అయ్యింది. సీట్లు పడుతున్నాయి. సందెపొద్దు సమయం. ఏ పోరగాడు మా గుడిసె తలుపు గెడియతీసి పోయినాడో తెల్వదు సామీ. నా బిడ్డ నిద్దరలేచి దోగాడుతూ రోడ్డు మీదకి వచ్చేసినాడు. పశువుల మందలు ఇళ్లకి మరలుతున్నాయి. ఆటి కాలి గిట్టల కింద పసిబిడ్డ నలిగి నలిగి నజ్జు నజ్జుగా అయిపోయాడు సామీ. పశువుల అరుపుల మద్దెన నా బిడ్డ ఏడుపు బయటకి రాలే. నేను ఇంటికి వచ్చేసరికి బిడ్డ ఇంటి ముంగిట కొన ఊపిరితో నెత్తురుముద్దలెక్కన పడి వున్నాడు. ఆస్పిటాలుకి తీస్కుపోయేసరికి దారిలో పానాలు ఇడిసినాడు. ఆడి పేరు కూడా రామూనే. ఆడు బతికుంటే ఈసరికి ఈ బిడ్డ లెక్కంతనే వుండేటోడు సామీ...'' పమిట చెంగుతో తల పెట్టుకుని వలవలా ఏడుస్తోంది ముత్యాలు.

మల్లేష్ సానుభూతిగా ఏదో అంటున్నాడు.

అదంతా అర్థం కాకపోయినా అలా చూస్తూ ఉండిపోయాడు రాము.

ఇంతలో...

''ఒరేయ్ తాతా...'' అంటూ దూరంగా అరుగుమీద నిల్చుని బామ్మ కేక పెట్టడంతో రాము రివ్వున పరిగెడుతూ ఇంటికి వచ్చాడు.

లోనికి రాబోతున్న మనవడ్ని ఆమడ దూరంలోనే ఆపింది సుబ్బమ్మ.

''అక్కడే దూరంగా వుంచో అప్రాచ్యపు వెధవా. ఆ కూరలమ్మిది ఏం కులమో ఏమో? నిన్ను అలా ఒళ్లంతా తడుముతూ ముద్దులు పెడుతుంటే దేభ్యం వెధవలా అలా నిల్చుండిపోతావేం. నువ్వెళ్లి ఎంతసేపయింది. అది నిన్ను అలా తాకుతుంటే బుద్ధిజ్ఞానం లేదా'' అంటూ లోపల్నుంచి బిందె నిండా నీళ్లు తెచ్చి నిలువునా మనవడి మీద కుమ్మరించింది సుబ్బమ్మ.

అప్పుడే జాగింగ్ నుంచి ఇంట్లోకి రాబోతున్న రాము తల్లీదండ్రీ అయోమయంగా నిల్చుండిపోయారు.

''పొద్దునే ఏం చేసాడత్తయ్యా వీడు?'' అంటూ సుశీల అత్తగారి వెంట వంటగదిలోకి వెళ్లింది.

''చూడవే నీ కొడుక్కి కాస్త మడీ మట్టు నేర్పు. ఆ కూరల దానికి చిల్లర మార్చి డబ్బులిచ్చిరారా అంటే అక్కడే కూర్చున్నాడు. దాని వంక ఎక్కి దానిచేత ఒళ్లంతా ముద్దులు పెట్టించుకుంటున్నాడు. పైగా అది చాకలేట్లు కొనిచ్చిందట. దాని కొడుకు చచ్చిపోయాడట. వాడి పేరు రాము అట. ఏదో వెధవ కబుర్లు చెబుతున్నాడు. చచ్చిపోయిన దాని కొడుకుకి వీడికి పోలిక ఏమిటి? పైగా అది వీడ్ని ముట్టుకోవడం ఏమిటి? దానిది ఏం కులమో ఏమిటో? అందుకే పసుపునీళ్లు కుమ్మరించా'' సుబ్బమ్మ అంటుంటే సుశీల నిశ్శబ్దంగా వుండిపోయింది.

## సినిమాలకు మధు గుడ్‌బై?



**నేను ఇష్టపడుతున్న వ్యక్తిని పెళ్లాడి జీవితంలో స్థిరపడదామనుకుంటున్నాను. అందుకనే సినిమాల సంఖ్య తగ్గించుకుంటున్నాను. పెళ్లయ్యాక సినిమాలకు గుడ్‌బై చెప్పేస్తానంటోంది మధుబాల. ఆనంద్ షా అనే ఆసామీతో ఆమె పెళ్లి గురించిన వార్తలు ఈమధ్య జోరుజోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధుబాల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ-'ఇక సినిమా రంగం నుంచి నిష్క్రమిస్తున్నాను. పెళ్లి చేసుకోడం వల్ల ఓ సరికొత్త జీవితంలోకి అడుగుపెడతాను' అంటూ ఇంత కాలం తారగా బోల్డంత కష్టపడ్డాను, ఇక చాలు...ఇల్లాలిగా జీవితంలోని థ్రిల్‌ని అనుభవించాలని వుంది అని ముసి ముసిగా నవ్వుతోంది. ఆల్ ది బెస్ట్!**

-జె.ఎం.

తల్లి మాటల్లోని అర్థం స్పష్టంగా గ్రహించిన మోహన్ నిలువునా తడిసి వణుకుతున్న కొడుకుని ఎత్తుకుని పొడి తువ్వాలుతో తుడుస్తూ మనసులో అనుకున్నాడు.

''అన్ని కులాలకంటే మతాలకంటే ప్రేమ గొప్పదమ్మా? నీకా సంగతి ఎప్పటికి అర్థం అవుతుంది?'' అనుకుంటూ ఏడుస్తున్న కొడుకుని ఓదార్చసాగాడు.

పేదరాలు అయినా కులం తక్కువదే అయినా పోయిన బిడ్డపై మమకారంతో బోణీగా వచ్చిన ఒక్క రూపాయితో చాకలేట్లు కొని పసివాడికి ఇచ్చింది కూరలమ్ముకునే ముత్యాలు.

కానీ తల్లిగా ఆ ముత్యాలు అంతరంగ నివేదన సుబ్బమ్మకి ఎప్పుడు తెలియాలి?

★